ప్రభుత్వ ఉపాధ్యాయులకు శిక్షణ

- జూన్ 2 నుంచి బడిబాట
- పాఠశాలలకు చేరిన పుస్తకాలు, దుస్తులు



రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వ టీచర్లకు శిక్షణ ఇస్తున్న నిపుణులు

ఖైరతాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన బోధన జరిగేలా ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తోంది విద్యాశాఖ. ఖైరతాబాద్, షేక్‌పేట మండలాల్లోని టీచర్లతో పాటు ప్రైమరీ పాఠశాలల టీచర్లకు ఒక్కొక్కరికి ఐదు రోజులపాటు ప్రత్యేక శిక్షణా శిబిరాలు నడుస్తున్నాయి. మరో రెండు రోజుల్లో ఇవి ముగియనుండగా జూన్ 2వ తేదీ నుంచి బడిబాట కార్యక్రమంలో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు బస్తీల్లో తిరుగుతూ చదువుకు దూరంగా ఉన్న పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించే కార్యక్రమాలు జరగనున్నాయి. జూన్ 12 నుంచి ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమయ్యేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంచేలా శిక్షణ

ప్రభుత్వ పాఠశాలల్లో పాఠాలు చెప్పే ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన నిష్ణాతులు ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. ఖైరతాబాద్, షేక్‌పేట మండలాల్లో మొత్తం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 17 ఉండగా, ప్రాథమిక పాఠశాలలు 47 ఉన్నాయి. మరో 2 ఎయిడెడ్ పాఠశాలలు ఉండగా, వీటికి అదనంగా గురుకుల, కస్తూర్బా పాఠశాలలు ఉన్నాయి. ప్రైవేట్ పాఠశాలలు 200 వరకు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచేలా, ప్రస్తుత సీసీపీ విధానం, అందులో వచ్చిన కొత్త మార్పులు, లైఫ్ స్కిల్స్, అభ్యసన సామర్థ్యం పెరిగేందుకు శిక్షణ ఇస్తున్నారు. రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన వారు జిల్లాస్థాయిలోని టీచర్లకు, జిల్లాస్థాయిలో ఎంపిక చేయబడ్డ టీచర్లు మండలస్థాయి టీచర్లకు శిక్షణ ఇస్తున్నారు. ఉన్నత పాఠశాలల టీచర్లకు సబ్జెక్ట్‌ల వారీగా, ప్రాథమిక పాఠశాలల టీచర్లకు ఒకే వేదికపై శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలలో సాంఘికశాస్త్రం, గణితం టీచర్లకు, యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో బయాలజీ టీచర్లకు, బంజారాహిల్స్ గతి పాఠశాలలో ప్రాథమిక పాఠశాలల టీచర్లు(ఎస్‌జీటీ)కు, అమీర్‌పేట ధరమ్‌కరమ్ రోడ్డులోని పాఠశాలలో ఫిజిక్స్ టీచర్లకు శిక్షణ ఇస్తున్నారు. మొత్తం 400 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు శిక్షణ పొందుతున్నారు. ఇవి చివరి దశకు చేరుకున్నాయి.



ఖైరతాబాద్ వాసవీ ప్రభుత్వ పాఠశాల

6వ తరగతి నుంచే ప్యాంట్లు..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తొలిరోజే పుస్తకాలు, దుస్తులు ఇచ్చేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. జూన్ 2వ తేదీ నుంచి బడిబాట కార్యక్రమం ప్రారంభమవుతుండగా అందులో స్కూళ్లలో కావాల్సిన మౌలిక సదుపాయాలను గుర్తించి వాటిని స్థానిక స్వయం సహాయక సంఘాల ద్వారా చేయించనున్నారు. దీంతోపాటు పాఠశాలల పరిధుల్లోని బస్తీలకు పాదయాత్రగా వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతున్న తీరు, నిష్ణాతులైన ఉపాధ్యాయుల బోధనా పద్ధతులు, అన్ని సౌకర్యాలను వివరించి స్కూళ్లకు వెళ్లని విద్యార్థులను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించనున్నారు. ఇప్పటికే అన్ని పాఠశాలలకు దుస్తులు, పుస్తకాలు చేరగా వాటిని తొలిరోజునే విద్యార్థులకు పంపిణీ చేసే ఏర్పాట్లు చేస్తున్నారు. ఏకరూప దుస్తుల్లో భాగంగా ఈసారి బాలురకు 6వ తరగతి నుంచే ప్యాంట్ ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. ఒకటి నుంచి 5వ తరగతి వరకు బాలురకు నెక్కరు, చొక్కా, 6 నుంచి 10వ తరగతి వరకు ప్యాంట్, చొక్కా, ఒకటి నుంచి 3వ తరగతి బాలికలకు ఫ్రాక్, షర్ట్, 4, 5 తరగతుల బాలికలకు స్కర్టు, షర్ట్, 6 నుంచి 10వ తరగతి బాలికలకు చుడీదార్, పైజామాలు అందించనున్నారు.

ఎంపిక చేయబడిన టీచర్లు..



ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మంచి విద్యాబోధన జరుగుతుంది. ఇక్కడ పరీక్షల్లో పోటీపడి ఎంపిక చేయబడిన టీచర్లు మాత్రమే ఉంటారు. పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నాం. ఉత్తమ బోధన జరిగేలా టీచర్లకు శిక్షణా కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా మా పాఠశాలలున్నాయి. రాజ్‌భవన్ పాఠశాలలో సీట్లు దొరకడమే కష్టంగా ఉంది. తల్లిదండ్రులు ఎలాంటి సంకోచం లేకుండా పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపవచ్చు. స్కిల్స్ ఆధారంగా పిల్లలకు పలు అంశాల్లో నైపుణ్యం, ఆటాపాటలతోపాటు శారీరక దా రుఢ్యం పొందేలా అకాడమిక్ ప్లాన్‌లను రూపొందిస్తున్నాం.

- శామ్యూల్‌రాజ్, ఉపవిద్యాధికారి



ఆదర్శ్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న కిషన్‌రెడ్డి, చింతల తదితరులు

బీజేపీ నేతకు పరామర్శ

ఖైరతాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఖైరతాబాద్ అధ్యక్షుడు ఆదర్శ్ వంశీకర్ తల్లి ఆవుల భాగ్యమ్మ(80) ఇటీవల మృతిచెందారు. మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బీజేపీ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు లంకెల దీపక్‌రెడ్డితో కలిసి ఆదర్శ్ వంశీకర్ కుటుంబసభ్యులను కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పరామర్శించారు. ఖైరతాబాద్ ఇందిరానగర్ కాలనీలోని వారి నివాసానికి వెళ్లి భాగ్యమ్మ చిత్రపటానికి నివాళులర్పించిన ఆయన ఆమె భర్త, బీజేపీ సీనియర్ నాయకుడు బాలరాజు, మరో కుమారుడు న్యాయవాది కళ్యాణ్ వంశీకర్‌తో పాటు కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు.



అధికారులతో కలిసి బుద్ధనగర్‌లో పర్యటిస్తున్న నీలిమ

బుద్ధనగర్‌లో సమస్యల పరిష్కారానికి కృషి

బేగంపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట డివిజన్ బుద్ధనగర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. అధికారులతో కలిసి ఆమె శనివారం బుద్ధనగర్‌లో పర్యటించారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అవసరమైన ప్రాంతంలో వెంటనే వీధిదీపాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తలిపారు. గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు, తాగునీటి సరఫరా వంటి సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు జమీల్, కృపాకర్, శివకుమార్, ప్రభాకర్‌రెడ్డి, సత్యం, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రావు, రాజేశ్వరి, రజనీకాంత్, నవీన్‌రాజ్, శంకర్‌గౌడ్, బాబురావు, ఆనంద్, శ్రీవేణి, పద్మావతి, భాస్కర్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

రహ్మత్‌నగర్ గ్రంథాలయానికి స్థానభ్రంశం

- వార్డు కార్యాలయంలోకి మార్చేందుకు ఏర్పాట్లు
- గ్రంథాలయంలోకి వార్డు కార్యాలయం



రహ్మత్‌నగర్ వార్డు కార్యాలయం



రహ్మత్‌నగర్ కూడలిలోని గ్రంథాలయం

బోరబండ, మే 24 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ కూడలిలోని గ్రంథాలయం త్వరలో స్థానభ్రంశం చెందనుంది. ఓ వైపు వైన్‌షాపు, మరోవైపు మరుగుదొడ్ల ఉన్న గ్రంథాలయాన్ని కూడలి వద్ద నుంచి రహ్మత్‌నగర్ వార్డు కార్యాలయంలోకి మార్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. కూడలిలోని గ్రంథాలయానికి విద్యావంతులైన గృహిణులు, మహిళలు, యువతులు వచ్చేవారు కాదు. గ్రంథాలయానికి వచ్చేవారు ఓ వైపు మందుబాబులు, ఇంకోవైపు మరుగుదొడ్ల దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు.

గ్రంథాలయంలో తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ, హిందీ దినపత్రికలతో పాటు, వివిధ భాషలకు చెందిన వార, మాసపత్రికలు అందుబాటులో ఉంటాయి. అంతేగాకుండా వేల సంఖ్యలో నవలలు, గ్రంథాలు, ఆటోబయోగ్రఫీలు, జీవిత చరిత్రలు, పరిశోధన గ్రంథాలు తదితర పుస్తకాలు ఇక్కడ లభిస్తాయి. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కీలకమైన ఈ గ్రంథాలయం కూడలిలో ఉండడం వల్ల ఇటు వాహనాల రణగొణ ధ్వనులు, తాగుబోతుల బెడద కారణంగా అవస్థ తప్పడం లేదు. దీనికి తోడు మహిళలు ఇక్కడకు రావాలంటే జంకుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన డివిజన్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి హైదరాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కూడా సమ్మతించడంతో రహ్మత్‌నగర్ కూడలిలోని గ్రంథాలయాన్ని న్యూటన్ హైస్కూల్ వద్దనున్న వార్డు కార్యాలయంలోకి మార్చనున్నారు. అక్కడి వార్డు కార్యాలయాన్ని గ్రంథాలయం ఉన్న చోటుకి మారుస్తారు. దీనివల్ల గ్రంథాలయంలో ప్రశాంతత ఉండడంతోపాటు పరిసర ప్రాంతాల్లోని విద్యార్థినులు, గృహిణులు, యువతులకు అందుబాటులో ఉంటుందని కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. అంతేగాకుండా గ్రంథాలయాన్ని సందర్శించే వారి సంఖ్య భారీగా పెరుగుతుందన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు.



ఫాగింగ్ సిబ్బందితో కార్పొరేటర్ మహేశ్వరి

ఫాగింగ్‌కు స్పెషల్ డ్రైవ్

బేగంపేట మే 24 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లో దోమల నివారణకు ఫాగింగ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కార్పొరేటర్ టిమహేశ్వరి తెలిపారు. శనివారం జీహెచ్‌ఎంసీ ఫాగింగ్ సిబ్బందితో కలిసి ఆమె స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలా సమీప బస్తీల్లో దోమల బెడద అధికంగా ఉందని, నివారణ కోసం నిత్యం ఫాగింగ్ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాస్, నాయకుడు టి.శ్రీహరి పాల్గొన్నారు.

8న విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

పంజాగుట్ట, మే 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వీరశైవ లింగాయత్, లింగబలిజ సంఘం రాష్ట్ర యువజన విభాగం ఆధ్వర్యంలో పదవ తరగతి పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన తమ సామాజిక వర్గం విద్యార్థులను జూన్ 8న ప్రతిభా పురస్కారాలతో సన్మానించనున్నట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పటోళ్ల సంగమేశ్వర్ తెలిపారు. ఆదర్శ్‌నగర్‌లోని బిర్లా ఆడిటోరియంలో నిర్వహించనున్న కార్యక్రమం బ్రోచర్‌ను సంఘం నాయకులతో కలిసి ఆయన శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈనెల 29లోగా విద్యార్థులు దరఖాస్తులను సంఘం ఈమెయిల్‌కు లేదా 9550445747, 9948186819కు వాట్సాప్ ద్వారా పంపించాలని ఆయన సూచించారు. సమావేశంలో సెంట్రల్ కమిటీ సభ్యులు శెట్టి శివకుమార్, రాష్ట్ర కోశాధికారి రాచప్ప, పి.శివచరణ్, శ్రావణి, వీరమణి, యువజన విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.భరత్ కుమార్, కె.సోమేశ్వర్, విజయ్, నాయకులు విశ్వనాథ్, శివకుమార్, మహేష్, సంతోష్ పాల్గొన్నారు.



రాష్ట్ర విద్యుత్ శాఖ సీఎండీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎస్.హరీష్‌కు శుభాకాంక్షలు చెబుతున్న విద్యుత్ శాఖ 1535 సెంట్రల్ అధ్యక్షుడు ఎంఏ వజీర్, రాష్ట్ర అధ్యక్షుడు కల్లెం శ్రీనివాసరెడ్డి, సభ్యులు సిరా ఆనంద్ కుమార్, అబ్దుల్ ఖాదర్, సుమధురి, రవి, శ్రీనివాస్, అభిలాష్, రమేష్, అనంతరెడ్డి తదితరులు

- ఎర్రగడ్డ, ఆంధ్రజ్యోతి

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



అవగాహన కార్యక్రమంలో క్యాపిటల్ అండ్ హౌసింగ్ ఫైనాన్స్ సిబ్బందితోపాటు ఏసీపీ శంకర్‌రాజు, ట్రాఫిక్ అధికారులు

హైదరాబాద్ సిటీ, మే 24 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్, సిగ్నల్ జంప్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, హెల్మెట్, సీట్ బెల్ట్ పెట్టుకోకుండా ప్రయాణం చేయడం వల్ల వాహనదారులు ప్రాణాలు కోల్పోవడంతోపాటు ఇతరుల ప్రాణాలకు కూడా హాని కలుగుతుందని నార్త్‌జోన్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. బేగంపేట టీటీఐ ఆధ్వర్యంలో అమీర్‌పేటలోని క్యాపిటల్ అండ్ హౌసింగ్ ఫైనాన్స్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని రోడ్డు భద్రత గురించి వివరించారు. అతివేగం ప్రమాదకరమని, అందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. బేగంపేట ఇన్‌స్పెక్టర్ నాగుల అశోక్ మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, మద్యం తాగి వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. కార్యక్రమంలో క్యాపిటల్ అండ్ హౌసింగ్ జోనల్ రిస్క్ మేనేజర్ రవి కుమార్, జియో సేల్స్ మేనేజర్ పి.భాస్కర్‌రెడ్డి, రికవరీ మేనేజర్ వెంకటరమణ, ఎస్‌ఆర్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై రాంబాబు, సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.



బోరబండ బస్టాపు వద్ద కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేస్తున్న మహిళా కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తానా



పండ్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ బాబాఫసియుద్దీన్



ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

మాదాపూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): శిల్పారామం మాదాపూర్‌లో డాక్టర్ వినీలరావు శిష్యబృందంచే కూచిపూడి నృత్యప్రదర్శన ఆద్యంతం అలరించింది. గణేశ్ పంచరత్న, బ్రహ్మాంజలి, శివతాండవం, బృందావన నిలయం, రామాయణ శబ్దం, జతిస్వరం, బాలగోపాల తారంగం, కొలువైతివా రంగసాయి, భో శంభో, దశావతారం, హిందోళ తిల్లాన అంశాలను కళాకారులు రుత్విజ, శాన్వి, వివేకా, సమ్మిత, ఆరాధ్య, సిరిచందన, గౌతమి, శిరీష, రితిక, విశీతా, సింధు, సాయిసరయు, వైష్ణవి, చరితకృష్ణ, స్రవంతి, దివ్య, గాయత్రీ మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు. గౌరీశంకర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి కళాకారులను అభినందించారు.



మాట్లాడుతున్న ఐపీఎస్ అభిలాష్ బిష్ట్

నాణ్యమైన విద్యనందించాలి

- ఐపీఎస్ అభిలాస్ బిష్ట్

బేగంపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరికి నాణ్యమైన విద్యనందించాలని ఐపీఎస్ అభిలాస్ బిష్ట్ అన్నారు. మురికివాడల్లోని పిల్లల కోసం పాఠశాలల నిర్మాణానికి నిధుల సేకరణే లక్ష్యంగా లేడీస్ సర్కిల్ ఇండియా, రౌండ్‌టేబుల్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన డిస్కౌంట్ కూపన్ బుక్‌లెట్‌ను ఆమె సోమాజిగూడలోని ఓ హోటల్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇది ఒక అత్యుత్తమ ఈవెంట్ అన్నారు. విద్యతోనే పేదరికాన్ని నిర్మూలించవచ్చని పేర్కొన్నారు. హైదరాబాద్ వన్ లేడీస్ సర్కిల్ 166 చైర్‌పర్సన్ కరిష్మా జైన్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలన్నారు. ప్రతి ఒక్కరికీ విద్య అందించాలన్నదే తమ అభిమతమన్నారు. ఈ డిస్కౌంట్ కూపన్ బుక్‌లెట్ కొనడం ద్వారా పాఠశాల నిర్మాణానికి తమ వంతు సహకారం అందించినట్లు అవుతుందని తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులతో పొదుపు సంఘాల ఏర్పాటు

బోరబండ, మే 24 (ఆంధ్రజ్యోతి): కొత్త పొదుపు సంఘాలు ఏర్పాటు చేయడం వల్ల పేద మహిళల ఆర్థిక అవసరాలు తీర్చేందుకు మార్గం సుగమం అవుతుందని జీహెచ్‌ఎంసీ సర్కిల్-19 డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటకిషన్‌రావు తెలిపారు. సర్కిల్ కార్యాలయంలో పారిశుద్ధ్య విభాగం ఎస్‌ఎఫ్‌ఏలు, రిసోర్స్‌పర్సన్లతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళా పారిశుద్ధ్య కార్మికుల ఆర్థిక సమస్యలకు పొదుపు సంఘాల ద్వారా పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ప్రభుత్వ పథకాలు పేదలకు అందించే క్రమంలో పారిశుద్ధ్య కార్మికులకు కూడా న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కొత్తగా 1500 పొదుపు సంఘాలను ఏర్పాటు చేసే ప్రక్రియలో భాగంగా మహిళా పారిశుద్ధ్య కార్మికులకు కూడా పొదుపు సంఘాలలో భాగస్వామ్యం కల్పించాలని సూచించారు. సమావేశంలో సర్కిల్-19 శానిటరీ సూపర్‌వైజర్ మర్రి విజయ్‌కుమార్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు వెంకటయ్య, శ్రీనివాస్, ప్రశాంత్ పాల్గొన్నారు.

నిమ్స్‌లో వెయ్యి మందికి అన్నదానం



అన్నదానం చేస్తున్న నాయకులు

హైదరాబాద్ సిటీ/ఎర్రగడ్డ/బోరబండ, మే 24 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ పుట్టిన రోజు సందర్భంగా పంజాగుట్ట నిమ్స్‌లో శనివారం అన్నదానం చేశారు. ఆస్పత్రికి వచ్చిన రోగులు, వారి సహాయకులు వెయ్యి మందికి ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీపీఎస్సీ మాజీ సభ్యుడు సీతారామరాజు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బొక్క చెన్నారెడ్డి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ సంజయ్ ముదిరాజ్, హౌసింగ్ ఫెడరేషన్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరామ్‌చక్రవర్తి, టీపీసీసీ కార్యదర్శి ప్రసన్నకుమార్, వనపర్తి టౌన్ మాజీ కాం గ్రెస్ అధ్యక్షుడు డి.కిరణ్ కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి దూడల రవిగౌడ్ ఆధ్వర్యంలో జీవోదయ హోమ్ ఫర్ చిల్డ్రన్స్ ఆశ్రమంలో పిల్లలకు నోట్ పుస్తకాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గంటా మల్లేష్, సాల్మన్, యాకమ్మ, లక్ష్మి, రాజమణి, మధుగౌడ్, హనుమంతరావు, ఆశ్రమ నిర్వాహకురాలు నిర్మల పాల్గొన్నారు.

ఉస్మానియా ఆస్పత్రిలో పండ్లు పంపిణీ

మహేష్ కుమార్‌గౌడ్ జన్మదినం సందర్భంగా ఉస్మానియా ఆస్పత్రిలో రోగులకు బోరబండ కార్పొరేటర్ మహ్మద్ బాబాఫసీయుద్దీన్ ఆధ్వర్యంలో పండ్లు, జ్యూస్, బ్రెడ్, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మంగళహాట్ డివిజన్ మాజీ కార్పొరేటర్, ఖైరతాబాద్ డీసీసీ జనరల్ సెక్రటరీ పరమేశ్వరిసింగ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుమార్, లడ్డూఖాన్, ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

దొంగిలించిన బైక్‌తో లారీని ఢీకొట్టిన దొంగ

యూసఫ్‌గూడ, మే 24 (ఆంధ్రజ్యోతి): దొంగిలించిన వాహనాన్ని అజాగ్రత్తగా నడిపి రోడ్డుపై నిలిపి ఉన్న లారీని ఢీకొట్టి దొంగ దొరికాడు. ఈ ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహ్మత్‌నగర్ ప్రాంతానికి చెందిన రాహుల్ ఈనెల 23న రాత్రి తన ద్విచక్ర వాహనాన్ని విజిలెన్స్ కార్యాలయం వద్ద పార్కు చేసి స్నేహితులతో కలిసి టీ తాగడానికి వెళ్లాడు. అర్ధరాత్రి రాహుల్ తన ద్విచక్ర వాహనాన్ని చూడగా కనబడలేదు. స్నేహితులతో కలిసి వెతుకుతుండగా ద్విచక్ర వాహనం నడుపుతున్న ఓ యువకుడు ఆపి ఉన్న లారీని ఢీకొట్టి పడిపోయాడు. రాహుల్ అక్కడికి వెళ్లి చూడగా యాక్టీవా తనదేనని గుర్తించి నిందితుడిని పట్టుకొని పోలీసులకు అప్పగించాడు. దొంగ రహ్మత్‌నగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ తోసిఫ్ అలియాస్ ఆమెన్‌గా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

స్నేహితురాలని దగ్గరకు తీస్తే దొంగతనం

యూసుఫ్‌గూడ, మే 24 (ఆంధ్రజ్యోతి): తెలిసిన స్నేహితురాలని దగ్గరకు తీస్తే దొంగతనం చేసింది. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లాకు చెందిన సిహెచ్.అరుంధతి సాగర్ రింగ్ రోడ్డులో ఉంటూ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుంది. గత నెల ఎల్లారెడ్డి గూడలో రూమ్ తీసుకొని విధులకు వెళ్తుంది. డ్యూటీలో సహోద్యోగి అయిన సౌభాగ్య పరిచయం కావడంతో రూమ్‌మెంట్‌గా చేసుకుంది. ఈనెల 14న అరుంధతి బంగారపు నగలు, నగదును చూసుకోగా కనిపించలేదు. దీంతో సౌభాగ్యపై మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364

తాగునీటి సమస్య పరిష్కారమయ్యేనా?

- కొన్ని ప్రాంతాల్లో రోజు విడిచి రోజు సరఫరా
- ఇంకొన్ని ఏరియాల్లో మూడు, నాలుగు రోజులకు..
- ఇబ్బందులు పడుతున్న కంటోన్మెంట్ ప్రజలు
- వాటర్‌బోర్డు, కంటోన్మెంట్ బోర్డు అధికారుల సమావేశం
- ప్రజల్లో చిగురిస్తున్న తాగునీటి ఆశలు

సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేనా?, ఇక్కడి ప్రజల అవసరాలకు అనుగుణంగా నీటి సరఫరా జరిగేనా? మెట్రో వాటర్ బోర్డు నుంచి కొనుగోలు చేసే మంచి నీటి పరిమాణాన్ని నిల్వ చేసి, సప్లయ్ చేసేందుకు నూతన రిజర్వాయర్లు, పంప్‌హౌజ్‌ల నిర్మాణం జరిగేనా..? అంటే దాదాపు అవుననే సమాధానమే వినిపిస్తోంది. శనివారం కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో మెట్రోవాటర్ బోర్డు, కంటోన్మెంట్ బోర్డు ఉన్నతాధికారుల సమావేశం దరిమిలా ఇవన్నీ సాధ్యమేనన్న ఆశలు ప్రజల్లో చిగురిస్తున్నాయి. ఇప్పటికైనా తాగునీటికి శాశ్వత పరిష్కారం లభించాలని ప్రజలు కోరుతున్నారు.


సమావేశంలో పాల్గొన్న అశోక్‌రెడ్డి, మధుకర్ నాయక్, శ్రీగణేశ్, బాణుక నర్మద

సికింద్రాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ పరిధిలో మాదిరిగా సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో కూడా మంచినీటి సరఫరా సక్రమంగా జరగవచ్చన్న నమ్మకం ఈ ప్రాంత ప్రజలకు కలుగుతోంది. కంటోన్మెంట్ బోర్డుకు రోజూ 6.9 లక్షల ఎంజీడీల మంచినీరు అవసరమవుతుంది. నీటి నిర్వహణను కంటోన్మెంట్ బోర్డే స్వయంగా నిర్వహిస్తోంది. మెట్రో వాటర్ బోర్డు నుంచి మంచి నీటిని కొనుగోలు చేసి, సొంత రిజర్వాయర్లు, పంప్ హౌజ్‌లకు తెప్పించుకుని, అక్కడి నుంచి పైప్‌లైన్ల ద్వారా కాలనీలు, బస్తీలకు నీటిని సరఫరా చేస్తోంది. నీటి బిల్లులు తానే వసూలు చేస్తోంది. కంటోన్మెంట్‌లో మూడు, నాలుగు రోజులకోసారి నీటి సరఫరా జరుగుతుండడంతో ఈ ప్రాంత ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే చొరవతో...

కంటోన్మెంట్‌లో తాగునీటి సమస్యపై కొద్ది నెలలుగా స్థానిక కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్, కంటోన్మెంట్ బోర్డు పాలక మండలి నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద మధ్య పరోక్ష యుద్ధం నడుస్తోంది. ఎమ్మెల్యే శ్రీగణేశ్ ప్రత్యేక చొరవతో శనివారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో మెట్రో వాటర్ బోర్డు - కంటోన్మెంట్ బోర్డు ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. సమావేశంలో మెట్రో వాటర్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి, కంటోన్మెంట్ సీఈవో మధుకర్ నాయక్, ఎమ్మెల్యే శ్రీగణేశ్, నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద, వాటర్ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు. నీటి సరఫరా సామర్థ్యం పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై వారు కూలంకషంగా చర్చించారు. కంటోన్మెంట్‌లో నీటి నిల్వ సామర్థ్యం పెంచుకోవడానికి అవసరమైన రిజర్వాయర్ల నిర్మాణానికి తాము సిద్ధంగా ఉన్నామని, అందుకు స్థలాలను కేటాయించాలని అశోక్‌రెడ్డి స్పష్టం చేశారు. కాగా కంటోన్మెంట్ బోర్డు నుంచి వాటర్ బోర్డుకు చెల్లించవలసిన రూ.20 కోట్ల బకాయిలు, రూ.10 కోట్ల కనెక్షన్ చార్జీల విషయమై కూడా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ (టీపీటీ) చార్జీల బకాయిలు తక్షణమే విడుదల చేస్తే, తాము నీటి సరఫరాకు వెచ్చించే వెసులుబాటు కలుగుతుందని మధుకర్ నాయక్ స్పష్టం చేశారు. ఈ విషయమై తాను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో మాట్లాడతానని శ్రీగణేష్ వెల్లడించారు.

గత పాలకుల నిర్లక్ష్యంతోనే ఈ దుస్థితి

గతంలో కంటోన్మెంట్‌లో శాసనసభ్యులుగా ఉన్న వారు, బోర్డు పాలక మండలి సభ్యులుగా ఉన్న నాయకులు ఎవరూ కంటోన్మెంట్‌లో ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయలేదు. రక్షణశాఖ పరిధిలో ఉన్నదని సాకుగా చూపుతూ కంటోన్మెంట్ అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారు. తాను చొరవ తీసుకోవడంతో మడ్‌ఫోర్టులో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.23 కోట్ల నిధులు మంజూరు చేసింది. స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి రక్షణ శాఖ అనుమతించింది. నీటి సరఫరా మెరుగుకు కూడా కృషి చేస్తా.

\- శ్రీగణేశ్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే

సీఎం, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

కంటోన్మెంట్‌లో నీటి సరఫరా మెరుగుకు, నీటి సరఫరా వ్యవస్థను పటిష్ఠం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపడం సంతోషంగా ఉంది. ఇందుకు కృషి చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీగణేశ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సహకారంతో కంటోన్మెంట్‌లో మరిన్ని అభివృద్ధి పనులు చేసేందుకు కృషి చేస్తా.

\- బాణుక నర్మద, కంటోన్మెంట్ బోర్డు పాలకమండలి నామినేటెడ్ సభ్యురాలు


మాస్ ఫాగింగ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

● జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి

తార్నాక, మే 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా మాస్ ఫాగింగ్ చర్యలు చేపట్టినట్టు డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం తార్నాకలోని తన క్యాంపు కార్యాలయ ఆవరణలో ఎంటమాలజీ సిబ్బందితో కలిసి డిప్యూటీ మేయర్ మాస్ ఫాగింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దోమల నివారణకు ఫాగింగ్ అనేది ఎంత గానో తోడ్పడుతుందని ఆమె చెప్పారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మరిన్ని పారిశుధ్య చర్యలను చేపడుతామని డిప్యూటీ మేయర్ శ్రీలత తెలిపారు.


స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో పాల్గొన్న పవర్ గ్రిడ్ ఉద్యోగులు, జేబీఎస్ సిబ్బంది

స్వచ్ఛత నిరంతర ప్రక్రియ

● పవర్ గ్రిడ్ సదరన్ రీజియన్ సీజీఎం వెంకట్

పద్మారావునగర్, మే 24(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత అనేది నిరంతర ప్రక్రియ అని పవర్ గ్రిడ్ సదరన్ రీజియన్ వన్ సీజీఎం వెంకట్ అన్నారు. స్వచ్ఛత పక్వాడలో బాగంగా శనివారం జూబ్లీ బస్‌స్టేషన్ సిబ్బందితో కలసి పవర్‌గ్రిడ్ సదరన్ రీజియన్ 1 ఉద్యోగులు జేబీఎస్ పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం వెంకట్ మాట్లాడారు. ప్రజలకు ఆరోగ్య వంతమైన వాతావరణాన్ని అందించడం కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. పవర్ గ్రిడ్ సంస్థ వివిధ సామాజిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటోందని చెప్పారు.


బస్‌షెల్టర్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ

బస్ షెల్టర్ పనులు పరిశీలన

బౌద్ధనగర్, మే 24 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ గాంధీ బొమ్మ వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న బస్‌స్టాప్ షెల్టర్ పనులను శనివారం సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బస్‌షెల్టర్ల కోసం జీహెచ్ఎంసీ కమిషనర్‌కు సంవత్సరం క్రితం వినతిపత్రం అందజేసినట్టు గుర్తు చేశారు. ప్రస్తుతం పనులు ప్రారంభమయ్యాయని, చిలకలగూడ గాంధీ బొమ్మ, నామాలగుండు బీఎస్ఆర్ గార్డెన్ వద్ద కూడా నూతన బస్ షెల్టర్లను ఏర్పాటు చేస్తున్నామని హేమ తెలిపారు.


పావని కుటుంబ సభ్యులకు పార్టీ ప్రమాద బీమా చెక్కును అందజేస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మహేశ్వర్‌రెడ్డి

బీఆర్ఎస్ కార్యకర్తలకు బీమా ధీమా

● పార్టీ నాయకుడు మహేశ్వర్‌రెడ్డి

బోయినపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ తమ కార్యకర్తలకు అండగా ఉంటుందని, పార్టీ శ్రేణులకు ఇన్సూరెన్స్ రూపంలో భరోసా కల్పిస్తున్నారని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి అన్నారు. కంటోన్మెంట్ బోర్డు 1వ వార్డుకు చెందిన పార్టీ కార్యకర్త కడెం పావని కొన్ని నెలల క్రితం మృతి చెందగా బీఆర్ఎస్ పార్టీ నుంచి పొందిన బీమా వచ్చింది. శనివారం పావని కుటుంబ సభ్యులకు రూ.2లక్షల ప్రమాద బీమా చెక్కును ఆయన కార్యాలయంలో అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలందరిని కంటికి రెప్పలా కాపాడుకుంటుందని అన్నారు. బీఆర్ఎస్ సభ్యత్వం తీసుకున్న ప్రతి నాయకుడు, కార్యకర్తకు ఈ బీమా ద్వారా రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు విజయ్, శంకర్, లక్ష్మి, రాజు తదితరులు పాల్గొన్నారు.

● ప్రపంచ శాంతి సభ



సికింద్రాబాద్ జింఖానా మైదానంలో శనివారం రాత్రి క్రైస్తవ మత ప్రచారకులు డా. కేఏ పాల్ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి సభ జరిగింది. కార్యక్రమంలో ఇతర దేశాలు, రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.
\- సికింద్రాబాద్, మే 24(ఆంధ్రజ్యోతి)

ఎంఎంటీఎస్ రైలు ఢీకొని వ్యక్తి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 24 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు ఎంఎంటీఎస్ రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం సంజీవయ్య పార్కు వద్ద జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట ఎస్‌బీటీ నగర్‌కు చెందిన సత్యేందర్(48) శనివారం సంజీవయ్య పార్కు సమీపంలో రైలు పట్టాలు దాటుతున్నాడు. ఈ క్రమంలో ఎంఎంటీఎస్ రైలు ఢీకొని సత్యేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం రైల్వే పోలీసులు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్


లబ్ధిదారులతో ఎమ్మెల్యే శ్రీగణేశ్

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

మారేడుపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): పేదింటి ఆడబిడ్డల వివాహాలకు కల్యాణలక్ష్మి, షాదీముబార్ పథకం అండగా నిలుస్తోందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెస్ట్ మారేడుపల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో 44 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ, పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు జరిగేలా అన్ని విధాలుగా అండగా ఉంటానని ఆయన హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మహేశ్వరి, హేమలత, తహసీల్దార్ పాండునాయక్, నాయకులు పాల్గొన్నారు.

మారేడుపల్లి: ప్రజా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ ప్రజలకు సూచించారు. పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 42 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని హామీనిచ్చారు. మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఉచిత బస్సు, 500కే గ్యాస్ సిలిండర్, ఉచిత 200 యూనిట్ల కరెంట్, సన్నబియ్యం పంపిణీతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని ఆయన అన్నారు.


పార్శిగుట్ట హనుమాన్ ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సాయిప్రసాద్


వేంకటేశ్వర ఆలయంలో అహల్యాబాయి త్రిశతాబ్ది జయంతి వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

అహల్యాబాయి సేవలు మరువలేనివి

● బీజేపీ నాయకులు

బౌద్ధనగర్, మే 24 (ఆంధ్రజ్యోతి): మహిళలను చైతన్యం చేయడంలో అహల్యాబాయి హోల్కర్ చేసిన సేవలు మరువలేనివని బీజేపీ బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడు పి.సాయిప్రసాద్‌గౌడ్ అన్నారు. అహల్యాబాయి 300వ జయంతి పురస్కరించుకుని కన్వీనర్ సుశీల ఆధ్వర్యంలో శనివారం పార్శిగుట్ట హనుమాన్‌ఆలయంలో ప్రత్యేక పూజలు, మహా హారతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సాయి మాట్లాడుతూ, భారతీయ సమాజంలో అహల్యాబాయి హోల్కర్‌కు ప్రత్యేక చరిత్ర ఉందని, ఆమె చేసిన సేవలను ప్రజలకు వివరించాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. హిందూ దేవాలయాల పరిరక్షణ కోసం అహల్యబాయ్ చేసిన కృషిని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో


అహల్యాబాయి జయంతి ఉత్సవాలకు హాజరైన బీజేపీ నాయకులు

నాయకులు దత్తు, కొమరయ్య, ఓములు, సత్యనారాయణ, నవీన్, అమరావతి, సురేశ్, జయంతి తదితరులు పాల్గొన్నారు.

అడ్డగుట్ట: అహల్యాబాయి హోల్కర్ సిద్ధాంతాలను నేటి మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షురాలు గాజుల సౌందర్య సూచించారు. అహల్యాబాయి త్రిశతాబ్ది జయంతి వేడుకలను పురస్కరించుకుని తుకారాంగేట్‌లోని వేంకటేశ్వర ఆలయంలో బీజేపీ నాయకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అహల్యాబాయి జయంతి ఉత్సవ సమితి జాయింట్ కన్వీనర్ శారద మల్లేశ్, పార్టీ సీనియర్ నాయకులు వీరేశం, సాయన్న, హంసరాజు, అనూష, కళావతి, జ్యోతి, ఉదయ్‌యాదవ్, వేణు, లక్ష్మణ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పద్మారావునగర్: రాజమాత అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి వేడుకలను శనివారం బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో పార్టీ డివిజన్ అధ్యక్షుడు రామంచ మహేశ్, రాజమాత అహల్యాబాయి ప్రోగ్రాం కన్వీనర్ ఎలకొండ శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆమె జీవిత చరిత్రను వివరించారు. పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ రాజశేఖరరెడ్డి, కృష్ణ, సురేశ్, కృష్ణ, హరినాథ్, శ్రీనివాస్, వెంకట్, కిరణ్, ఆండాలు, లక్ష్మి, సురేఖ, సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.


ఫాగింగ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి


కార్పొరేటర్ శైలజతో ఎంటామాలజీ సిబ్బంది

పరిసరాల శుభ్రత పాటించాలి: కార్పొరేటర్లు

బేగంపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత శుభ్రతతో పాటు ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి ప్రజలకు సూచించారు. దోమల నివారణకు జీహెచ్ఎంసీ ఫాగింగ్ సిబ్బందితో కలిసి శనివారం బేగంపేట డివిజన్‌లోని అల్లం తోట బాయిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బేగంపేట డివిజన్‌లో దోమల నివారణకు ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాస్, నాయకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధనగర్: బౌద్ధనగర్ డివిజన్‌లో దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టామని కార్పొరేటర్ కంది శైలజ అన్నారు. ఈ మేరకు శనివారం బౌద్ధనగర్‌లో జీహెచ్ఎంసీ ఎంటమాలజీ అధికారులు, సిబ్బందితో కార్పొరేటర్ సమావేశమయ్యారు. జీహెచ్ఎంసీ పైలట్ ప్రాజెక్ట్ కింద దోమల నివారణకు ప్రత్యేక ఫాగింగ్ మిషన్లు వచ్చాయని కార్పొరేటర్ తెలిపారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని దోమలు వ్యాప్తి చెందకుండా డివిజన్ వ్యాప్తంగా ఫాగింగ్ చేస్తున్నామన్నారు. ఎంటమాలజీ ఏఈ సునీత, సూపర్‌వైజర్ యూనస్, సిబ్బంది పాల్గొన్నారు.

బొల్లారంలో ఉచిత దంత పరీక్షలు

తిరుమలగిరి మే 24 (ఆంధ్రజ్యోతి): బొల్లారంలోని వివేకానంద పార్కులో మల్లారెడ్డి డెంటల్ కాలేజి ఫర్ ఉమెన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. చిన్నారుల నుంచి పెద్ద వరకు దంత పరీక్షలు చేయించుకున్నారు. దంతాలను కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు ప్రజలకు వివరించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్రకార్యదర్శి నరసింహన్, జీవి బాల్‌రాజ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐపీఎస్ అభిలాస్ బిష్త్

నాణ్యమైన విద్యనందించాలి: ఐపీఎస్ అభిలాస్ బిష్త్

బేగంపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరికి నాణ్యమైన విద్యనందించాలని ఐపీఎస్ అభిలాస్ బిష్త్ అన్నారు. మురికివాడల్లోని పిల్లల కోసం పాఠశాలల నిర్మాణానికి నిధుల సేకరణే లక్ష్యంగా లేడీస్ సర్కిల్ ఇండియా, రౌండ్‌టేబుల్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన డిస్కౌంట్ కూపన్ బుక్‌లెట్‌ను ఆమె సోమాజిగూడలోని ఓ హోటల్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇది ఒక అత్యుత్తమ ఈవెంట్ అన్నారు. విద్యతోనే పేదరికాన్ని నిర్మూలించవచ్చని పేర్కొన్నారు. హైదరాబాద్ వన్ లేడీస్ సర్కిల్ 166 చైర్‌పర్సన్ కరిష్మా జైన్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలన్నారు. ప్రతి ఒక్కరికీ విద్య అందించాలన్నదే తమ అభిమతమన్నారు. ఈ డిస్కౌంట్ కూపన్ బుక్‌లెట్ కొనడం ద్వారా పాఠశాల నిర్మాణానికి తమ వంతు సహకారం అందించినట్లు అవుతుందని తెలిపారు.


సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సునీత

నాణ్యత ప్రమాణాలతో సీసీ రోడ్ల నిర్మాణం

● మెట్టుగూడ కార్పొరేటర్ సునీత

చిలకలగూడ, మే 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని మెట్టుగూడ కార్పొరేటర్ సునీత అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. మెట్టుగూడ డివిజన్‌లోని విజయపురి కాలనీలో శనివారం జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ అధికారులతో కలసి రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, వీలైనంత త్వరగా ప్రజలకు రోడ్డును అందుబాటులోకి తేవాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.


స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కాంగ్రెస్ నాయకురాలు నీలిమ

సమస్యల పరిష్కారానికి కృషి

● కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ

బేగంపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని కాంగ్రెస్ అమీర్‌పేట డివిజన్ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. అమీర్‌పేట డివిజన్‌లోని బుద్ధనగర్‌లో అధికారులతో కలిసి ఆమె శనివారం పర్యటించారు. బుద్ధనగర్‌లో నెలకొన్న సమస్యలను స్థానికులు కోట నీలిమ దృష్టికి తీసుకెళ్లారు. స్థానికులు పేర్కొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆమె అధికారులకు సూచించారు. అనంతరం నీలిమ మాట్లాడుతూ, సనత్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఈ జమీల్, కృపాకర్, శివకుమార్, ప్రభాకర్‌రెడ్డి, సత్యం, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రావు, రాజేశ్వరి, రజనీకాంత్, నవీన్‌రాజ్, శంకర్ గౌడ్, బాబురావు, ఆనంద్, శ్రీవేణి, పద్మావతి, భాస్కర్, వివేక్ పాల్గొన్నారు.

చందన అలంకరణలో వేంకటేశ్వరస్వామి

బౌద్ధనగర్, మే 24 (ఆంధ్రజ్యోతి): నామాలగుండు కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మూలవిరాట్ వేంకటేశ్వర స్వామి వారు శనివారం చందన అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. వైశాఖ మాసం పురస్కరించుకుని కల్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని చందనంతో పాటు ప్రత్యేక పూలతో అలకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నోముల ప్రకాశ్‌రావు ఇందిరా దంపతులతో పాటు నాయకులు బిట్ల రఘునందన్, మిట్టపల్లి బాబురావు, నాగులూరి శ్రీనివాస్‌గౌడ్, భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | జి.అంజయ్య: 9985921364